

పర్యవేక్షణ ఎలా?!

జిల్లాలో 21మండలాలకు గాను ఇద్దరే రెగ్యులర్ ఎంఈఓలు ఉండడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. 8లో



ప్రభుత్వంలోకి ఆర్టీసీ ఉద్యోగులు!

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించిన నేపథ్యాన రీజియన్‌లో 2,109 మంది ఉద్యోగులకు లబ్ధి జరగనుంది. 10లో

గరిష్టం / కనిష్టం

30° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో శ్రీవారి గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, సిబ్బంది

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈమేరకు శ్రీవేంకటేశ్వరస్వామి, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు చేసిన గోవిందనామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, అర్చకులు ఉప్పల రాజీవ్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

65 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపులో 65 మంది దివ్యాంగులు సర్టిఫికెట్‌కు అర్హత సాధించారు. మొత్తం 139 మంది స్లాట్ బుక్ చేసుకోగా 134 మంది క్యాంపునకు హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు 65 మందిని అర్హులుగా గుర్తించి సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేశారు.

ముందస్తుగా రేషన్ బియ్యం పంపిణీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: మున్నేరు ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ముందస్తుగా రేషన్ బియ్యం పంపిణీని మంగళవారం ప్రారంభించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. వరద ముంచెత్తిన నేపథ్యాన ప్రజలు ఇబ్బంది పడొద్దని బియ్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బియ్యం తీసుకున్న లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో వేలిముద్ర వేయాలని సూచించారు. పౌరసరఫరాల సంస్థ డీఎం సోములు, ఏఎంటీ నర్సింహారావు, డీటీ నిస్సార్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియాతో పాటు ఇబ్రహీం, మహేష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్ బదిలీ



సుభాష్‌చంద్రబోస్

ఖమ్మంక్రైం: జిల్లా పోలీసు శాఖలోని అడిషనల్ డీసీపీ(శాంతి భద్రతలు) సుభాష్‌చంద్రబోస్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయనను రాష్ట్ర కంట్రోల్ సెంటర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఏడాదిన్నర క్రితం ఖమ్మంకు బదిలీపై వచ్చిన ఆయన మూడేళ్ల సర్వీస్ కాకముందే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. గతంలో అడ్మిన్ డీసీపీగా పనిచేసిన శబరీష్‌ను బదిలీ చేయగా ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఇప్పుడు బోస్‌ను కూడా బదిలీ చేసి ఆస్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో రెండు డీసీపీ పోస్టులు ఖాళీ అయ్యాయి. అయితే రానున్న ఎన్నికల దృష్ట్యా ఐపీఎస్ లేదా గ్రూప్–1 నుంచి ఉద్యోగోన్నతి పొందిన అధికారిని నియమించనున్నట్లు సమాచారం.

జిల్లా సంక్షేమాధికారిగా సుమ



తాళ్లూరి సుమ

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా సంక్షేమాధికారిగా తాళ్లూరి సుమను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమెకు ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. దీంతో సుమను జిల్లా సంక్షేమాధికారిగా, మహిళా, శిశ సంక్షేమ, వికలాంగుల, వృద్ధు శాఖల అభివృద్ధి అధికారిగా డిప్యూటేషన్‌పై నియమించారు. ప్రస్తుతం జిల్లా సంక్షేమాధికారిగా బీసీ సంక్షేమాధికారి జి.జ్యోతి అదనపు బాధ్యతలు నిర్వహిర్తిస్తున్నారు.

ప్రశాంతంగా పరీక్ష

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర గురుకుల కళాశాలల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీకి మంగళవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఈమేరకు ఉదయం పరీక్షకు 602మందిలో 548మంది, మధ్యాహ్నం పరీక్షకు 547మందికి గాను 497మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు.



కూలిపోయిన వెంచర్ ప్రహరీ

మున్నేటి ఒడ్డున మోతీనగర్‌లో చేసిన వెంచర్ ఇది. సుమారు పదెకరాల్లో ఉండగా.. మున్నేటిని ఆనుకుని వెంచర్ వైపు వరద రాకుండా అర కి.మీ. మేర ప్రహరీ నిర్మించారు. కొన్ని ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టగా పైకప్పు వరకు వరద చేరింది. పునాది తక్కువగా ఉన్న ఇళ్లు వరద తాకిడికి నేలమట్టమయ్యాయి. ఏటి ఒడ్డున ఇళ్ల నిర్మాణం ప్రమాదమని తెలిసినా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.



కొనసాగుతున్న ఇళ్లు, సీసీ రోడ్డు నిర్మాణాలు

పెద్దమ్మగుడిబజార్‌లో మున్నేటి సమీపానికి ఈ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇటీవల వచ్చిన వరద అంతా ఈ ప్రాంతాన్ని కమ్మేసింది. ఇక్కడ నిర్మాణం జరుగుతున్న ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. అంతేకాకుండా సీసీ రోడ్డు నిర్మాణమూ పూర్తయింది. ఈ ప్రాంతం వరద ముంపులో ఉన్నా.. అన్ని అనుమతులు ఇస్తుండడంతో ఇళ్ల నిర్మాణం సాఫీగా జరుగుతూనే ఉంది.



మున్నేటి మధ్యలో నిర్మాణం

వెంకటేశ్వరనగర్‌లో ఏటి మధ్యనే ఈ ఇంటి నిర్మాణం చేశారు. దేవాలయం వెనక ఉన్న భూమిలో పిల్లర్లు వేసి కింద భాగం ఖాళీగా వదిలి పైన గదులు నిర్మించారు. వరద వచ్చినా కింద నుంచి పారుతుందనే భావనతో ఇలా చేశారు. మొన్నటి మున్నేటి వరద పైగదుల వరకు వెళ్లింది. ప్రమాదం పొంచి ఉందని తెలిసి కూడా ఏటి మధ్యనే ఈ నిర్మాణం చేపట్టడం గమనార్హం.

మున్నేరు.. చెర పట్టారు!

బఫర్‌జోన్‌లో వందలాదిగా అక్రమ నిర్మాణాలు

- ఏటి ఒడ్డునే వెంచర్లు చేసి ప్లాట్ల విక్రయం
- పరిశీలించకుండానే అనుమతులు, సౌకర్యాల కల్పన
- తాజా వరదలతో బయటపడిన ప్రమాద తీవ్రత
- అడ్డు'కట్ట' వేయకపోతే బఫర్ జోన్ కనుమరుగే..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జలాశయాల ప్రవాహానికి ఇరువైపులా కొంతమేర ఉండేది బఫర్ జోన్. వరదలను పరిగణనలోకి తీసుకొని బఫర్ జోన్‌ను నిర్ధారిస్తారు. ఈ భూమిలో వ్యవసాయం తప్ప నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. రిజిస్ట్రేషన్ చేయడం కానీ విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ శాఖల నుంచి అనుమతులు కానీ ఇవ్వొద్దు. కానీ ఖమ్మంలోని మున్నేటి బఫర్ జోన్‌లో వీటన్నింటినీ ఆయా శాఖలు తుంగలో తొక్కాయి. కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా ఇస్తున్న అనుమతులతో బఫర్ జోన్ క్రమేణా కరిగిపోగా, ఇటీవల వచ్చిన వరదలతో ప్రమాద తీవ్రత బయటపడింది. గత 18 ఏళ్లలో లేనట్లు మున్నేరు గరిష్టంగా 30.70 అడుగులకు చేరడంతో పరీవాహక ప్రాంతమైన ఖమ్మం కార్పొరేషన్, ఖమ్మం రూరల్ మండలంలో 2,225 ఇళ్లలోకి వరద చేరింది.

వెంచర్లు చేసి అమ్మకం

బఫర్‌జోన్‌ను ఆక్రమిస్తూ వెంచర్లు, లే ఔట్లు చేస్తూ ప్లాట్లు అమ్మేశారు. ఏటికి ఇరువైపులా నీటి ప్రవాహానికి ఆక్రమణలున్నాయి. మోతీనగర్, పెద్దమ్మగుడిబజార్ ప్రాంతం, వెంకటేశ్వరనగర్, జలగంనగర్, కేబీఆర్‌నగర్ ప్రాంతాల్లో ఇంకా వెంచర్లు ఏర్పాటవుతుండగా.. అమ్మిన ప్లాట్లలో శరవేగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఖమ్మంలోని మిగతా ప్రాంతంతో పోలిస్తే ఇక్కడ ప్లాట్ల ధర తక్కువ కావడంతో పేద, మధ్యతరగతి వర్గాలు కొనుగోలు చేయగా, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండానే రెవెన్యూ శాఖ అనుమతులు ఇస్తోంది.

విద్యుత్ సౌకర్యం, సీసీ రోడ్లు

మున్నేటి బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు సంబంధించి వసతుల కల్పన కూడా సాఫీగా సాగుతోంది. సీసీ రోడ్లు, తారు రోడ్లు వేయడమే కాక విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే 'మామూలు'గా అనుమతి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా, ఏటి మధ్యలో పిల్లర్లు వేసి ప్రవాహం కింది నుంచే వెళ్లేలా నిర్మాణాలు చేపట్టినా అధికారులకు కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

అడ్డు'కట్ట' పడకపోతే..

ప్రభుత్వం మున్నేటి పరీవాహకంలో మూడు కి.మీ. కాంక్రీటు వాల్ నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలం వైపు పరీవాహకంలో 30 అడుగుల ఎత్తుతో దీన్ని నిర్మిస్తారు. బొక్కలగడ్డ నుంచి ధంసలాపురం వరకు కిలోమీటరున్నర, జలగంనగర్ వైపు కిలోమటరున్నర మేర నిర్మించనున్నారు. ఈ నిర్మాణం పూర్తయితేనన్నా బఫర్‌జోన్ మున్ముందు ఆక్రమణలకు గురికాకుండా ఉంటుందని భావిస్తున్నారు.

2,225 ఇళ్లలోకి వరద నీరు

ఖమ్మం కార్పొరేషన్, ఖమ్మం రూరల్ మండలంలోని మున్నేటికి ఇరువైపులా రెండు కి.మీ.లోపు ఉన్న ప్రాంతాలను ఇటీవల వరద ముంచింది. బొక్కలగడ్డ, మోతీనగర్, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, అగ్రహారం, రామన్నపేట, జలగంనగర్, కేబీఆర్ నగర్, పోలేపల్లిలోని ఎన్జీవోస్ కాలనీ, దివ్యాంగుల కాలనీలు వరద తాకిడికి గురయ్యాయి. ఆయా ప్రాంతాల్లో 2,225 ఇళ్లలోకి వరద చేరడంతో 44ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా, 928 ఇళ్లలో గృహోపకరణాలు వరదలో కొట్టుకుపోయాయి. చాలా ఇళ్ల ప్రహరీలు కూలిపోయాయి. ఇలా బఫర్‌జోన్‌లో చేపట్టిన నిర్మాణాలతో బాధితులు తీవ్రనష్టాన్ని చవిచూశారు.

తహసీల్దార్ల బదిలీలు

- జిల్లా నుంచి 17మందికి స్థానచలనం
- ఇతర జిల్లాల నుంచి 20మంది కేటాయింపు

ఖమ్మం సహకారనగర్: త్వరలో సాధారణ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యాన ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాష్ట్రప్రభుత్వం శాఖల వారీగా ఉద్యోగులను బదిలీ చేస్తోంది. ఇందులో భాగంగా తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు జిల్లా నుంచి 17మందిని ఇతర జిల్లాలకు బదిలీ చేయగా, పొరుగు జిల్లాల నుంచి ఖమ్మంకు 20 మందిని కేటాయించారు. త్వరలోనే వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

బదిలీ తహసీల్దార్లు వీరే..

జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలిలా ఉన్నాయి. టి.శ్రీనివాసరావు, ఎస్.వీ.నారాయణమూర్తి, డి.సైదులు, సీహెచ్.రమణిని మహబూబాబాద్ జిల్లాకు కేటాయించారు. అలాగే, జి.కృష్ణను మెదక్ జిల్లాకు కేటాయించగా, హెచ్.రంగా, తుమాటి శ్రీనివాసరావు, డి.తిరుమలాచారి, దారా ప్రసాద్, గుడిచుట్టు శిరీష, కె.రవికుమార్, ఎం.మంగీలాల్, ఎం.రమాదేవి, డి.జగదీశ్వరప్రసాద్, వీ.వీ.శకుంతల, ఎం.డీ.ముజాహిద్, డి.పుల్లయ్యను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

జిల్లాకు ఎవరెవరంటే...

ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కే.వీ.శ్రీనివాసరావు, ఏ.రాజేంద్రకుమార్, వి.సురేష్‌కుమార్, శివయ్య, పీ.వీ.రామకృష్ణ, సీహెచ్.శేషగిరిరావు, ఎం.ఉషాశారద, జి.లూథర్ విజన్, సీహెచ్.స్వామి, ఎం.ఏ.రాజు, ఈ.నాగేశ్వరావు, వి.రవికుమార్‌ను ఖమ్మం జిల్లాకు కేటాయించారు. అలాగే, మహబూబాబాద్ జిల్లా నుంచి ఏ.పున్నం చందర్, ఏ.రమేష్, కె.యోగీశ్వరరావు, పి.రాంప్రసాద్, వరంగల్ జిల్లా నుంచి ఎస్.సంపత్‌కుమార్, డి.మంజుల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి వై.రామారావు, ములుగు జిల్లా నుంచి విజయ్ భాస్కర్‌ను ఖమ్మం కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

లావాదేవీల్లో డీసీసీబీ భేష్

- రూ.1,080 కోట్ల డిపాజిట్లతో రాష్ట్రంలో రెండో స్థానం
- పంట రుణాలుగా రూ.1,300 కోట్లు
- డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) జూలై 31 నాటికి రూ.2,805 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచిందని చైర్మన్ కూరాకుల నాగభూషణం వెల్లడించారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టర్నోవర్‌లో కరీంనగర్ డీసీసీబీ ప్రథమ స్థానంలో ఉండగా, ఆ తర్వాత ఖమ్మం అందరి కృషితో రెండో స్థానం దక్కించుకుందని తెలిపారు. మూడేళ్ల క్రితం బలహీనమైన స్థితిలో ఉన్న బ్యాంకును నేడు రూ.1,080 కోట్ల డిపాజిట్లు, రూ.1,724 కోట్ల రుణాలతో ముందడుగు వేయించామని చెప్పారు. సేకరించిన డిపాజిట్లను రైతులు, సామాన్య ప్రజలకు రుణాలలుగా అందిస్తున్నామని, పంట రుణాలు మంజూరులో ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. 2022–23లో వానాకాలం, యాసంగి సీజన్లలో పీఏసీఎస్‌లు రూ.570.02 కోట్ల మేర వ్యాపారం చేసి రూ. 81 కోట్ల లాభాలు గడించాయని వివరించారు. డీసీసీబీ పరిధిలోని సహకార సంఘాల్లో అర్హత కలిగిన సభ్యులందరికీ 2022 నుంచి బీమా చేయిస్తున్నట్లు చైర్మన్ నాగభూషణం తెలిపారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, పక్కన సీఈఓ వీరబాబు

రైతులకు విరివిగా రుణాలు

ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లకు గాను రూ.1,300 కోట్ల మేర రైతులకు పంట రుణాలుగా ఇచ్చామని చైర్మన్ చెప్పారు. రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏడాదిలోగా చెల్లించి రెన్యూవల్ చేసుకోవచ్చని తెలిపారు. సకాలంలో చెల్లించకపోతే మాత్రం 14 శాతం వడ్డీ పడుతుందని చెప్పారు. ఇక ఖాతాదారులు, వ్యాపారులకు రూ. 340 కోట్ల మేర బంగారు ఆభరణాలపై రుణాలు ఇచ్చామన్నారు. విదేశాలకు వెళ్లే రైతుల పిల్లలు 900మందికకి విదేశీ విద్యాపథకం ద్వారా రుణాలు ఇచ్చామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు టర్నోవర్‌ను రూ.3వేల కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చైర్మన్ తెలిపారు. తప్పుడు ధృవ పత్రాలతో రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేసిన వారిపై చర్యలు తప్పవని చైర్మన్ స్పష్టం చేశారు. ఇప్పటికే 23 మందిని గుర్తించగా, వీరిలో ఇద్దరు చెల్లించారన్నారు. మిగతా వారిపై సీబీసీఐడీ దర్యాప్తు చేస్తోందని వివరించారు. ఈ సమావేశంలో సీఈఓ అట్లూరి వీరబాబు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దు..
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, డీఎఫ్ఓ సిద్ధార్థ, అదనపు కలెక్టర్లు అభిలాష, మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో అటవీ భూముల ఆక్రమణకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అటవీ రక్షణ, అటవీ, రెవెన్యూ సమస్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోడు భూమి సాగు చేసుకుంటున్న 5,644 మందికి మొదటి విడతలో, 6,500 మందికి రెండో విడతలో పట్టాలు ఇచ్చామన్నారు. ఇదే సమయాన పీసా గ్రామసభలు నిర్వహించి అటవీ రక్షణపై తీర్మానం తీసుకుని సర్పంచ్‌ను బాధ్యుడిగా చేశామన్నారు. దీంతో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎవరైనా పోడును ప్రోత్సహించినా, వారికి సహకరించినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే, హరితహారం కింద జిల్లాలో నాటిన 1.30 కోట్ల మొక్కలను కాపాడుకోవాలన్నారు. ఎవరైనా అవెన్యూ ప్లాంటేషన్‌లోని మొక్కలను కొట్టేస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ కొందరు పట్టాలు ఇప్పిస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గుత్తికోయలకు ప్రలోభపెట్టి డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. ఇప్పటికే 12 కేసులు నమోదు చేసినందున అలాంటి వారి వారి మాటలు నమ్మొద్దని సూచించారు.

అక్టోబర్ 4న ఓటర్ల తుదిజాబితా విడుదల

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 1,439 పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు సేకరించడానికి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల కేంద్రాల మార్పు, పేర్లు మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఈనెల 21న ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించాక అక్టోబర్ 4న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు అభిలాష, మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పుష్పలత, వాణిశ్రీ, సుమ, శైలజ, రాంబాబు, పార్టీల ప్రతినిధులు నల్లమోతు తిరుమలరావు, ఉపేంద్ర, విద్యాసాగర్, యర్రా శ్రీకాంత్, తాటి వెంకటేశ్వరరావు, చింతనిప్పు కృష్ణచైతన్య, కె.కరుణాకర్ పాల్గొన్నారు.

సహాయక చర్యలు వేగవంతం చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. నగరంలోని దంసలాపురం కాలనీలో పనులను మంగళవారం తనిఖీ చేసిన ఆయన వివరాలు ఆరా తీశారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, కేఎంసీ ఉప కమిషనర్ బి.మల్లీశ్వరి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా రుణం తీర్చుకుందాం

- అంతా కలిసికట్టుగా పనిచేద్దాం
- భద్రాచలానికి శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమైన ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి



సభలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన పొదెం వీరయ్య, కోరం కనకయ్య తదితరులు

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు : పోరాడి సాధించుకున్న తెలంగాణలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ సాధించింది ఏమీ లేదని, మళ్లీ తప్పుడు హామీలతో గెలవాలని చూస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులంతా సమష్టిగా కృషిచేసి రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తేవాలని, తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం, ఇల్లెందులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు, వరదలతో ముంపునకు గురైన ప్రాంతాలను పట్టించుకోకుండా పక్క రాష్ట్రంలో అధికారం కోసం కేసీఆర్ తపనపడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఇటీవలి వరదలతో భద్రాచలం, ఖమ్మంలో వేలాది మంది ఇబ్బంది పడ్డారని తెలిపారు. గతేడాది వరదల సందర్భంగా భద్రాచలం వచ్చిన సీఎం ముంపు బాధితులకు రూ.1000 కోట్లతో ఎత్తయిన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మి స్తామని ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఖమ్మంలోని మున్నేరుపై తీగల వంతెనకు ప్రకటించిన రూ.280 కోట్లు విడుదల చేయకుండానే ఆర్‌సీసీ వాల్‌కు రూ.150 కోట్లు ప్రకటించార న్నారు. కాగా, టికెట్ ఎవరికి ఇచ్చినా ఉమ్మడి జిల్లాలో పది స్థానాలను గెలుచుకుందామన్నారు. డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కొత్తగూడెం, ఇల్లెందులో మోటార్‌సైకిళ్లతో ర్యాలీ నిర్వహించగా, ఇల్లెందు, గార్ల, టేకులపల్లి, బయ్యారం మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, వారిని పొంగులేటి ఆహ్వానించారు. ఈకార్యక్రమాల్లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, నాయకులు నాగా సీతారాములు, పాయం వెంకటేశ్వర్లు, విజయాబాయి, తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది సాహసం

వరదలో వెళ్లి లైన్ మరమ్మతు

విద్యుత్ లైన్ మరమ్మతుకు రావడంతో వరదలో ఈదుతూ వెళ్లి మరీ సిబ్బంది పనులు చేసి సరఫరా పునరుద్ధరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు బేతుపల్లి మిగులు జలాలతో వేంసూరు మండలంలోని రాళ్లచెరువు నిండు కుండలా మారింది. ఇంతలోనే రాళ్ల చెరువు మధ్యలో నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్ ఇన్సులేటర్ ఫెయిల్ అయింది. దీంతో లింగపాలెం, కందుకూరు సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈమేరకు సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది నిండు కుండలా చెరువులో నుంచి ఈదుతూ వెళ్లి మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.


– వేంసూరు



చెరువు మధ్యలో ఉన్న స్తంభంపై మరమ్మతు చేస్తున్న సిబ్బంది

పర్యవేక్షణ ఎలా ?!

జిల్లాలో ఇద్దరే రెగ్యులర్ ఎంఈఓలు
- మిగతా 19 మండలాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు
- అటు పర్యవేక్షణ లేక.. ఇటు బోధన సాగక ఇక్కట్లు
- మన ఊరు – మన బడి పనులపైనా ప్రభావం



ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అనేక చర్యలు చేపడుతున్నట్లు చెబుతోంది. కానీ ఓపక్క పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదనే విమర్శలున్నాయి. వీటికి తోడు పాఠశాలలను పర్యవేక్షించాల్సిన రెగ్యులర్ ఎంఈఓలు కూడా లేకపోవడం సమస్య తీవ్రతకు కారణమవుతోంది.

ఒక్కొక్కరికి రెండేసి మండలాలు

జిల్లాలో 21 మండలాలు ఉండగా.. వీటి పరిధిలో 1216 ప్రభుత్వ, 282 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలను సైతం నిత్యం పర్యవేక్షిస్తూ సమస్యలు ఎదురుకాకుండా ఎంఈఓలు చూడాల్సి ఉంటుంది. కానీ అరకొరగా ఎంఈఓలు ఉండటంతో పర్యవేక్షణ లోపిస్తోంది. సుమారు పదేళ్లుగా ఎంఈఓల పోస్టులు భర్తీ చేయకపోవటంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం జిల్లాలో ఇద్దరే రెగ్యులర్ ఎంఈఓలతో కాలం వెళ్లదీస్తున్నారు. రెగ్యులర్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్ ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాలు, మరో ఎంఈఓ రాములు సత్తుపల్లి, నేలకొండపల్లి మండలాల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగతా మండలాల్లో సీనియర్ హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగించగా... వారికి సైతం రెండు, మూడు మండలాలను కేటాయించడం గమనార్హం.

పర్యవేక్షణ అంతంతే

జిల్లాలో ఇద్దరే రెగ్యులర్ ఎంఈఓలు ఉండగా... వారు నాలుగు మండలాల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిగతా 17మండలాల్లో ఒక ప్రధానోపాధ్యాయుడికి ఆ మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా, మరో మండలానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు అటు హెచ్‌ఎం బాధ్యతలు నిర్వర్తించలేక.. ఇక ఎంఈఓగా పర్యవేక్షణ చేయలేక సతమవుతున్నారు. అధికారిక కార్యక్రమాలు, సమీక్షలకు హాజరు కావడం, మధ్యాహ్న భోజన నివేదికల తయారీ, ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, జీతభత్యాలు, ప్రగతి నివేదికలు పంపించడంతో పాటు మన ఊరు – మన బడి పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. పనిభారంతో ఇవేమీ సరిగ్గా చేయలేకపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా క్షేత్రస్థాయిలో పలు సమస్యలను పరిష్కరించేందుకు నోడల్ ఆఫీసర్లను నియమించగా... వీరు మండలంలో పర్యవేక్షిస్తూనే తొలిమెట్టు, ఉన్నతాధికారులు అడిగిన నివేదికలు సమర్పించడానికే పరిమితమవుతున్నారు. అలాకాకుండా ప్రత్యేకంగా ఎవరినైనా ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా నియమించి, వీరికే బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యాయపరమైన సమస్యలతో జాప్యం



ఎంఈఓ పోస్టుల భర్తీ విషయంలో న్యాయపరమైన సమస్యలు ఉన్నాయి. అవి పరిష్కారం కాగానే ఎంఈఓలు నియామకం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం తొలిమెట్టు కార్యక్రమం నిర్వహణకు ఇబ్బంది రాకుండా నోడల్ ఆఫీసర్లను నియమించాం. ఇక ఎంఈఓల కొరతతో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం.

– సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

సీపీని కలిసిన హోంగార్డ్ ఆఫీసర్లు



సీపీకి వినతిపత్రం ఇస్తున్న హోంగార్డ్ ఆఫీసర్లు

ఖమ్మంక్రైం: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ హోంగార్డ్ ఆఫీసర్లు మంగళవారం సీపీ విష్ణు ఎస్.వారియర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్మినెంట్ చేయడంతో పాటు కారుణ్య నియామకాలు, ఉద్యోగ విరమణ తర్వాత ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందేలా చూడాలని కోరారు. హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఫీతో పాటు బంక శ్రీను, వెంకటేశ్వర్లు, కొల్లు విజయ్‌కుమార్, నీరజ, వెంకన్న, రవి, రహీం, రవి, రమేష్, ఉపేందర్, సుజిత, మురళి పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి 16వరకు గడువు

కల్లూరు: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలకు ఈనెల 16 వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మధిర స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ కోరారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు మీ సేవ, టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు 16లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని ఆయన తెలిపారు.

విద్యాసంస్థల్లో 'కలక'లం

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ గురుకుల కళాశాలలో కళ్ల కలక విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. సుమారు 200 మంది విద్యార్థులకు కళ్ల కలకతో బాధపడుతుండగా వైద్యశిబిరం ఏర్పాటు చేయించినట్లు ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీఓ ప్రత్యూష తెలిపారు. అలాగే, నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో కూడా 20 మంది విద్యార్థినులకు కళ్లకలక సోకింది. ఒకరి ద్వారా మరొకరికి వ్యాపిస్తుండడంతో వీరికోసం ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే, ప్రభుత్వ వైద్యులతో చికిత్స చేయించినట్లు ప్రిన్సిపాల్ ఉజ్వల కుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రమీల తెలిపారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు

తిరుమలాయపాలెం: ఓ రైతు భూమిని కౌలు చేస్తున్న వ్యక్తిని కులం పేరుతో దూషించడమే కాక పంటను ధ్వంసం చేసిన ఇద్దరిపై పోలీసులు మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మండలంలోని తాళ్లచెరువుకు చెందిన దొంతరబోయిన సత్యనారాయణ భూమిని తెట్టెలపాడుకు చెందిన పేరాల లక్ష్మయ్య కౌలుకు సాగుచేస్తున్నాడు. ఈక్రమంలో గత నెల 2న సత్యనారాయణ బంధువు దొంతరబోయిన పూర్ణయ్య, ఆయన భార్య భవాని వచ్చి భూమి సాగు చేయొద్దంటూ కులం పేరుతో దూషిస్తూ పత్తి పంటను ధ్వంసం చేశారు. ఘటనపై లక్ష్మయ్య చేసిన ఫిర్యాదుతో పూర్ణయ్య, భవానీపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాలర్ల వలలో కొండచిలువ!



వలకు చిక్కిన కొండచిలువ

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి వాగులో జాలర్లు చేపల కోసం ఏర్పాటు చేసిన వలలో కొండ చిలువ చిక్కుకుంది. గ్రామానికి చెందిన జాలర్లు మంగళవారం వాగులో వలలు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఎనిమిది అడుగుల పొడవు, 30 కేజీలకు పైగా బరువు ఉన్న కొండ చిలువ చిక్కుకుని మృతి చెందింది.

కనకదుర్గ ఆలయంలో చోరీ



ఆలయంలో విచారణ చేపడుతున్న పోలీసులు

బోనకల్: మండలంలోని మోటమర్రి శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఈ మేరకు అమ్మవారి బంగారపు మంగళసూత్రాలు, హుండీ, వెండి కళ్లు, వెండి కలశాలు, అమ్మవారి త్రిశూలం ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం ఉదయం పరిశీలించి అనుమానితుల వివరాలు సేకరించారు. హుండీలో రూ.20 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కాగా, ఎస్సై సాయికుమార్, ఏఎస్‌ఐ బాలస్వామితో పాటు ఖమ్మం నుంచి క్లూస్ టీం సభ్యులు ఆలయాన్ని పరిశీలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

రహదారుల అభివృద్ధికి పెద్దపీట

జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కమల్‌రాజ్, కొండబాల

బోనకల్: గ్రామీణప్రాంతంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.13 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావుతో కలిసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేలా సీఎం కేసీఆర్ నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ చైర్మన్ బందం శ్రీనివాసరావు, ఎంపీడీఓ వేణుమాధవ్, ఎంపీపీ కంకణాల సౌభాగ్యంతో పాటు జొన్నలగడ్డ సునీత, చేబ్రోలు మల్లికార్జున్, మోదుగుల నాగేశ్వరావు, బానోతు కొండ, తమ్మారపు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్‌మీడియట్‌లో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఈమేరకు అవగాహన కల్పించేందుకకు రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ గౌతమ్ మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. రెగ్యులర్‌గా పాఠశాల, కళాశాలకు వెళ్లి చదువుకోలేని వారు ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్‌స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, సీఎంఓ రాజశేఖర్, ఏపీఓ రామకృష్ణతో పాటు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ భూమి ఆక్రమణపై విచారణ



భూముల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ఉన్న శ్రీరామచంద్ర స్వామి ఆలయ భూముల ఆక్రమణపై దేవాలయ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఆలయానికి సంబంధించిన 2.17 ఎకరాల భూమిని కొందు ఆక్రమించుకున్నారని ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. ఈమేఏరకు పరిశీలించిన అధికారులు ఆలయ భూముల్లో సీసీ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని సూచిస్తూ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే ఆలయ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవాలయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐబీఎంతో పరస్పర ఒప్పందం

'శ్రీ చైతన్య' చైర్మన్, డైరెక్టర్ వెల్లడి



ఒప్పంద పత్రాలతో మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య

ఖమ్మం సహకారనగర్: అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన ఐబీఎం కంపెనీతో శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌కు ఒప్పందం కుదిరిందని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈమేరకు నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల కార్యాలయంలో మంగళవారం సీఈఓ పుట్టా శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఐబీఎంతో ఒప్పందం కుదిరిన నేపథ్యాన 14 కోర్సుల్లో బోధనకు సహకరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఏపీల్లో మొదటి ఒప్పందం ఇదే కాగా, విద్యార్థులకు మెరుగైన ప్లేస్‌మెంట్లు లభిస్తాయని చెప్పారు. ఈసమావేశంలో హెచ్ఓడీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా నల్లగొండకు బదిలీ



నర్సింహారావుకు శుభాకాంక్షలు చెబుతున్న ఇన్‌చార్జ్ తహశీల్దార్ సైదులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.నర్సింహారావుకు ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు ఆయనను నల్లగొండ జిల్లాలో భూసేకరణ విభాగానికి కేటాయించిన ఉన్నతాధికారులు మునుగోడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాధ్యతలు కూడా అప్పగించారు. రెండేళ్లకు పైగా ఇక్కడ విధులు నిర్వర్తించిన ఆయన ప్రభుత్వ భూముల రక్షణకు విశేష కృషి చేశారు. కాగా, కొణిజర్ల తహసీల్దార్ సైదులును రఘునాథపాలెం ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆయన మంగళవారం నర్సింహారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఎకరానికి రూ. కోటి పరిహారం ఇవ్వాలి



నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చింతకాని: నాగపూర్ నుంచి అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూమి కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూముల్ని కోల్పోతున్న కొదుమూరు, వందనం గ్రామాల రైతులను సీపీఐ నాయకులు మంగళవారం కలిసి మాట్లాడారు. ఖమ్మంకు సమీపాన ఉన్న భూమికి రూ.24 లక్షల పరిహారమే చెల్లించడం సరికాదన్నారు. అంతేకాకుండా రైతులు లేకుండా పోలీసు బందోబస్తు సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా పరిహారం పెంచడంతో పాటు బావులు, పైపులైన్లకు కూడా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వర్లు, కూచిపూడి రవి, పావులూరి మల్లికార్జున్‌రావు, నక్కనబోయిన కృష్ణ, నారపోగు నాగార్జున, కొల్లి సీతయ్య, గోవిందరావు, రెడ్డిబోయిన సతీష్, నారపోగు శ్రీను, వేముల సతీష్, రైతులు పాల్గొన్నారు.

శ్యాంబాబుకు లయన్స్‌క్లబ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్యాంబాబు దంపతులు

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ అవార్డు గెలుచుకున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గవర్నర్ తీగల మోహనరావు ఆధ్వర్యాన 20 నూతన క్లబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు 1,100 మందిని సభ్యులుగా చేర్పించారు. ఈమేరకు ఆయనకు ఆర్గనైజేషన్ గ్రోత్ అవార్డు ప్రకటించగా హైదరాబాద్‌లో మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా శ్యాంబాబును డాక్టర్ కాపా మురళీకృష్ణ, నంబూరి మధు, లగడపాటి ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్‌గౌడ్ తదితరులు అభినందించారు.

బస్టాండ్‌కు బయలుదేరిన వృద్ధురాలి అదృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నుంచి స్వగ్రామైన బయలుదేరిన వృద్ధురాలు దూదేకుల మైబుసుభానీ ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. మధిర మండలం సిద్ధినేనిగూడెంకు చెందిన ఎస్.కే.సైకిలాబ్ ఖమ్మం రామన్నపేటలో ఉంటూ సుతారీ పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల సిద్ధినేనిగూడెం నుంచి వచ్చిన ఆయన తల్లి మైబుసుభానీ గత నెల 31న బయలుదేరగా ఆటో ఎక్కించి పాత బస్టాండ్‌కు పంపించాడు. కానీ సాయంత్రం వరకు స్వగ్రామానికి చేరకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో వృద్ధురాలు

ఖమ్మంలోని వైరా ప్రధాన రహదారి వెంట నిలబడిన వృద్ధురాలు ఎర్రబడి పార్వతి కాసేపటికి కానరాకుండా పోయింది. వెలుగుమట్ల కాలనీకి చెందిన అప్పారావు మంగళవారం తన తల్లిని ఫించన్ డబ్బుల కోసం ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్నాడు. ఎస్‌ఆర్ గార్డెన్స్ వద్ద బంక్‌లోకి వెళ్తూ ఆయన తల్లిని రహదారి వెంట దింపగా తిరిగొచ్చే సరికి కనిపించలేదు. ఆమె మానసిక స్థితి సరిగా లేపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఖమ్మం రూరల్ మండలంలో...

ఖమ్మంరూరల్: మండలంలోని వాల్యాతండాకు చెందిన ధారావత్ క్రాంతికుమార్ కానరాకుండా పోయాడు. ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న ఆయన గత నెల 20న కిరాయి ఉందని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడ గాలించినా ఆచూకీ లేకపోవడంతో ఆయన భార్య శ్రీదేవి మంగళవారం చేసిన ఫిర్యాదుతో ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ ఏసీపీగా సారంగపాణి



సారంగపాణి

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ ఏసీఈపీగా ఎస్.సారంగపాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ట్రాఫిక్ ఏసీపీగా పనిచేసిన రామోజీ రమేష్‌కు ఏఎస్పీగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న పోస్ట్‌లో సారంగపాణిని నియమించారు. 1995 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన సారంగపాణి ఉమ్మడి జిల్లాలో ఎస్ఐ, సీఐగా విధులు నిర్వర్తించడంతో పాటు రామగుండం కమిషనరేట్‌లో ఏసీపీగా పనిచేశారు. కాగా, బాధ్యతలు స్వీకరించాక ఆయన సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రీడా ప్రాంగణాలకు సామగ్రి

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లావ్యాప్తంగా క్రీడా ప్రాంగణాలకు సామగ్రిని స్పోర్ట్స్ అథారిటీ మంజూరు చేసింది. ఈమేరకు పర్యవేక్షణ కోసం చైర్మన్‌గా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో కమిటీలను నియమించారు. క్రికెట్ కిట్లతో పాటు వాలీబాల్, జిమ్ పరికరాలు, డిస్కస్‌త్రో, స్కిప్పింగ్ టెన్నికాయిట్ కిట్లే కాక టీషర్ట్స్ అందజేస్తారు. అయితే కొన్ని క్రీడాప్రాంగణాలకు క్రీడాకారులు రాకపోవడంతో పలువురు పీఈటీలు క్రీడా ప్రాంగణాలకు బదులు సామగ్రిని పాఠశాలకు ఇవ్వాలని సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తుంది.

తల్లిదండ్రులపై కుమారుడి దాడి

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడుకు చెందిన డి.పుష్ప, వెంకటనారాయణపై వారి కుమారుడు డి.మధు మంగళవారం దాడికి పాల్పడ్డాడు. కుటుంబ తగాదాలతో ఘర్షణ పడిన మధు దుర్భాషలాడుతూ దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

మండలంలోని ఆరేకోడుతండాకు చెందిన తేజావత్ రాజేశ్వరిని ఆమె భర్త, అత్తామామలు, ఆడపడుచులు అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తుండడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. డోర్నకల్ మండలం బొడ్రాయితండాకు చెందిన రాంబాబుతో ఐదేళ్ల క్రితం ఆమెకు వివాహం జరగగా రూ.10లక్షలు కట్నం ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించాక మరింత కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

మున్నేరులో రైతు గల్లంతు



కొండల్‌రావు (ఫైల్)

ముదిగొండ: విద్యుత్ మోటార్ పరిశీలనకు వెళ్లిన ఓ రైతు మున్నేటి వరదలో గల్లంతయ్యాడు. మండలంలోని గంధసిరికి చెందిన రైతు చమట కొండల్‌రావు మంగళవారం పొలం వద్దకు వెళ్లాడు. మోటారు స్విచ్ వేసినా నీళ్లు రాకపోవడంతో మున్నేరులోని నీటిలో ఉన్న మోటార్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఆయనకు ఈత రాకపోవడంతో ప్రవాహానికి కొట్టుకుపోగా, సహచర రైతులు స్థానికులకు తెలిపారు. దీంతో ఎస్ఐ నరేష్, సిబ్బంది గ్రామస్తుల సహకారంతో గాలింపు చేపట్టినా రాత్రివరకు ఆచూకీ లభించలేదు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కల్లూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కల్లూరుకు చెందిన పిట్టల లక్ష్మయ్య, రాధమ్మ ద్విచక్ర వాహనంపై మంగళవా రం మిట్టపల్లి వెళ్తున్నారు. వీరిని ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడగా లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు నకిరేకల్‌కు చెందిన లారీ డ్రైవర్ పల్లెపు వెంకన్నపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

వేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపే యత్నంలో ఘటన

కారేపల్లి: అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించగా.. ట్రాక్టర్ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తవిసిబోడులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తవిసిబోడుకు చెందిన నూనావత్ కళ్యాణ్ (24) ట్రాక్టర్ డ్రైవర్ పనిచేస్తూనే వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో గేట్ రేలకాయలపల్లిలో పనులు ముగించుకుని బాబాయి అజ్మీరా చిన్నేశ్వర్‌రావుతో ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఇదే సమయాన తవిసిబోడు నుంచి గేట్ రేలకాయలపల్లి వైపు ఇసుక ట్రాక్టర్‌తో టేకులపల్లికి చెందిన మాలోతు శివాజీ అతివేగంగా వెళ్లుండడంతో వీరు ద్విచక్రవాహనాన్ని పక్కకు ఆపగా, కళ్యాణ్ కిందకు దిగి ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించాడు. ఈక్రమంలో ట్రాక్టర్‌ను ఆయనను ఢీకొట్టగా తీవ్రగాయాలు కావటంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో ఆయన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కాగా, ఖమ్మం ఆస్పత్రిలో కళ్యాణ్ మృతదేహం వద్ద వైరా ఎమ్మెల్యే రాములు నివాళులర్పించి కుటుంబీకులను ఓదార్చారు. ఘటనపై మృతుడి తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన కేసులో ఆరేళ్ల జైలు

ఖమ్మం లీగల్: భార్య ఆత్మహత్యకు కారణమైన ఏన్కూర్ మండలం గార్లఒడ్డు గ్రామానికి చెందిన బానోత్ చిన్న(లక్ష్మా)కు ఆరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువడింది. ఈమేరకు ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అమరావతి మంగళవారం వెలువరించి తీర్పు వివరాలిలా ఉన్నాయి. గార్లఒడ్డుకు చెందిన లక్ష్మా భార్య కంసాలి ఇంటి వద్దే ఉంటూ భర్త, పిల్లలను పట్టించుకోకుండా మద్యానికి బానిసైంది. 2014 జూలై 14న రాత్రి ఆయన ఇంటి కొచ్చే సరికి కంసాలి మద్యం మత్తులో ఉండడంతో మందలించాడు. దీంతో ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకోగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆగస్టు 4న మృతి చెందింది. ఘటనపై ఏన్కూర్ పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసును విచారణ అనంతరం లక్ష్మాకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ బి.కృష్ణమోహన్ వాదించగా, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు సహకరించారు.

మంచిరేవుల భూములు ప్రభుత్వానివే

గ్రేహౌండ్స్‌కు బదలాయించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు

" మంచిరేవులలోని ఈ భూములకు విలువ పెరగడంతో వాటిపై రాబందుల కళ్లు పడ్డాయని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ల్యాండ్ మాఫియా జోక్యం కూడా కనిపిస్తోంది. ఈ భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తుదివి. ఎలాంటి జోక్యాలు అనుమతించబోం"
– జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలోని 142.39 ఎకరాల భూయాజమాన్య హక్కులు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 1994 నుంచి కొనసాగుతున్న భూవివాదానికి ముగింపు పలికింది. ఆక్రమణకు గురైన ఈ భూములు గ్రేహౌండ్స్‌కు సంబంధించినవని పేర్కొంది. మంచిరేవుల భూములకు సంబంధించి హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు విచారించిన జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం మంగళవారం తుదితీర్పు వెలువరించింది. మంచిరేవులకు సంబంధించిన భూములు ప్రైవేటు వ్యక్తులవేనని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. దీనిని విచారించిన డివిజన్ బెంచ్ 2021లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు అనంతరం ఇచ్చిన తుదితీర్పులో.. ఆర్టికల్ 142 ప్రకారం అధికారాలు వినియోగిస్తూ ఈ పిటిషన్లు కొట్టివేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఈ భూములపై కిందిస్థాయి కోర్టులు, హైకోర్టు ఎలాంటి జోక్యం చేసుకునే అధికారం లేదని, ఇప్పుడు ఇచ్చిన తీర్పే తుదితీర్పు అని ఆదేశాల్లో పేర్కొంది. సదరు భూమి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందని, తదుపరి కేటాయింపులపై దాని యాజమాన్య, స్వాధీన హక్కులు ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకొని గ్రేహౌండ్స్‌కు బదిలీ చేయాలని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు కేకే వేణుగోపాల్, సీఎస్ వైద్యనాథన్, గిరి, ఏఓఆర్ శ్రీహర్షలు వాదనలు వినిపించారు. ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న ఈ భూములు పలువురు ఆక్రమించుకొని 1993లో అక్రమంగా విక్రయించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయాన్ని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసింది.

రూపు మారుతున్న ఉత్తరాంధ్ర

విశాఖపట్నంకు ఇనార్బిట్ మాల్: ఏపీ సీఎం వైఎస్ జగన్

- రూ. 600 కోట్లతో 12 – 13 ఎకరాల్లో భారీ స్థాయిలో నిర్మాణం
- 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి
- రెండో దశలో 2.5 లక్షల చదరపు అడుగుల్లో 'ఐటీ స్పేస్'.. మరో 3 వేల జాబ్స్
- అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ దిశగా ప్రణాళికలు
- నగరంలో 7 స్టార్ హోటల్ నిర్మాణానికి రహేజా ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ అభివృద్ధికి మరింత దోహదపడేలా నగరానికి ఆణిముత్యంలా ఇనార్బిట్ మాల్ నిలిచిపోతుందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విశాఖ పర్యటన సందర్భంగా కైలాసపురం ప్రాంతంలో రూ.600 కోట్ల పెట్టుబడులతో రహేజా గ్రూప్ చేపట్టిన ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమి పూజ చేశారు. రూ.134.58 కోట్లతో జీవీఎంసీ తలపెట్టిన అభివృద్ధి పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీలో రూ.130 కోట్లతో నిర్మించిన ఐదు భవనాలను సీఎం ప్రారంభించారు. దక్షిణాది లో అతి పెద్దదైన ఇనార్బిట్ మాల్‌తో పాటు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ స్పేస్, కన్వెన్షన్ సెంటర్‌ను కూడా తర్వాత దశలో రహేజా సంస్థ నిర్మించనుందని సీఎం జగన్ వెల్లడించారు. కేటాయించిన మొత్తం స్థలం విస్తీర్ణం 17 ఎకరాలు కాగా 12–13 ఎకరాల్లో మాల్ ఏర్పాటు కావడం చాలా తక్కువ ప్రాంతాల్లో మాత్ర మే జరుగుతుందన్నారు. ఇదే రహేజా గ్రూప్ హైద రాబాద్‌లో ఇనార్బిట్ మాల్‌ను కేవలం 7–8 ఎకరా ల్లో నిర్మించగా విశాఖలో 12–13 ఎకరాల్లో నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...

ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా..

ఇంత భారీ మాల్ ఏర్పాటుతో విశాఖ రూపురేఖలు మారడమే కాకుండా దక్షిణాదిలో అతి పెద్దదిగా నిలవనుంది. 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. 12–13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తరువాత 2 దశ కింద మిగిలిన 4 ఎకరాల్లో 2.5 లక్షల చదరపు అడుగుల్లో ఐటీ స్పేస్ కూడా అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయ స్థాయిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందించారు. ఐటీ స్పేస్ ద్వారా మరో 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు రానున్నాయి. గత పర్యటన సందర్భంగా విశాఖలో అదానీ డేటా సెంటర్, ఐటీ స్పేస్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశాం. ఇవన్నీ రానున్న రోజుల్లో విశాఖ, ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చేలా గొప్ప అడుగులు అవుతాయి. మాల్ కూడా అదే కోవలోకి వస్తుంది.



ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్. చిత్రంలో నీల్ రహేజా

సాగర తీరంలో 7 స్టార్ హోటళ్లు..

రహేజా గ్రూప్ దేశంలో పలు చోట్ల ఫైవ్‌స్టార్ హోటళ్లను నిర్మించింది. అదేవిధంగా ఏపీలో కూడా రాజ్ విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్‌స్టార్, 7 స్టార్ హోటళ్ల నిర్మాణం కానున్నాయి. ఇప్పటికే ఒబెరాయ్ సంస్థ రాజ్ విలాస్ తరహాలో 7 స్టార్ కేటగిరీలో రిసార్ట్, మే ఫెయిర్ సంస్థ సూపర్ లగ్జరీ 7 స్టార్ హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చాయి. అదే తరహాలో నీల్ రహేజా కూడా 7 స్టార్ హోటల్‌ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఇవన్నీ విశాఖ రూపురేఖలను మార్చే గొప్ప ప్రాజెక్టులు అవుతాయి. ఇక హిందూపూర్‌లో 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్‌కు సంబంధించిన పార్క్ రానుంది. దీని ద్వారా 15 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు నీల్ రహేజా తెలియచేశారు.

ఏపీలో ఎంతో అనువైన వాతావరణం

దార్శనిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో వ్యాపారాభివృద్ధికి ఎంతో అనువైన వాతావరణం ఉంది. అతి తక్కువ సమయంలో ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయడం శుభ పరిణామం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ వరుసగా అగ్రస్థానంలో నిలవడానికి ఇవే కారణం. ఈ మాల్ ప్రజల షాపింగ్ అవసరాలు తీర్చడమే కాకుండా ఆహ్లాదకరమైన, వినోదాత్మక ప్రదేశంగా అందరినీ ఆకట్టుకుని అలరిస్తుంది.
– రజనీష్ మహాజన్, ఇనార్బిట్ మాల్ సీఈవో

మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం

ఇక్కడ త్వరలో నిర్మించబోయే ఐటీ స్పేస్ ద్వారా ఐటీ రంగం అభివృద్ధి కార్యక్రమాలను చేపడతాం. మాకు ప్రపంచవ్యాప్తంగా రాజ్‌విల్లాల తరహాలో లగ్జరీ హోటళ్లున్నాయి. అదే కాన్సెప్ట్‌ను విశాఖతో పాటు ఏపీలో తేవాలనుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన పారిశ్రామిక పార్కులపై కూడా దృష్టి సారిస్తున్నాం. హిందూపూర్‌లో 350 ఎకరాల్లో టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కు అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా 15 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. విశాఖలో ఇనార్బిట్ మాల్‌ను దుబాయ్ మాల్, మాల్ ఆఫ్ ఎమిరేట్స్ తరహాలో ప్రపంచ స్థాయి మాల్‌గా అభివృద్ధి చేస్తున్నాం. మాల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దుతాం.
– నీల్ రహేజా, రహేజా గ్రూప్ ప్రెసిడెంట్

రాష్ట్రంలో 39 అమృత్ భారత్ స్టేషన్లు

- తొలిదశలో 21 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు 6న ప్రధాని శంకుస్థాపన
- వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా తెలంగాణలోని మొత్తం 39 రైల్వే స్టేషన్లను గుర్తించి వీటిని సంపూర్ణంగా ఆధునీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి విడతగా 21 స్టేషన్లకు సంబంధించిన పనులను ఆగస్టు 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

'అమృత్ భారత్ స్టేషన్ల'పథకంలో భాగంగా.. రైల్వే స్టేషన్లను ఆధునీకరించడంతోపాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఉచిత వై–ఫై సదుపాయాన్ని కల్పిస్తారు. అదేవిధంగా స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' దుకాణాలు, ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించే వ్యవస్థలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు ఏర్పాటు చేస్తారు. స్టేషన్ ముందు, వెనక భాగాల్లో మొక్కల పెంపకంతో పాటు చిన్న గార్డెన్లు కూడా నెలకొల్పుతారు. ఇక స్టేషన్ల అవసరాలకు అనుగుణంగా బిజినెస్ మీటింగ్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేయనున్నారు. వీటికి తోడుగా నగరానికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలను అనుసంధానం చేయడం, దివ్యాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు, పట్టాలకు ఇరువైపులా కాంక్రీట్ బాటలు, రూఫ్ ప్లాజాలు (అవసరాన్ని బట్టి), దీర్ఘకాలంలో అవసరమయ్యే నిర్మాణాలను ఈ పథకంలో భాగంగా చేపట్టనున్నారు. కాగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో వచ్చే 40 ఏళ్ల అవసరాలు తీర్చేవిధంగా అభివృద్ధి చేసేందుకు రూ.715 కోట్లు, చర్లపల్లి టర్మినల్ అభివృద్ధికి రూ.221 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిన విషయం తెలిసిందే.

తెలంగాణలో మొత్తం గుర్తించిన స్టేషన్లు 39: ఆదిలాబాద్, బాసర్, బేగంపేట్, భద్రాచలం రోడ్, గద్వాల్, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ, ఉప్పుగూడ, హైదరాబాద్ (నాంపల్లి), జడ్చర్ల, జనగాం, కాచిగూడ, కామారెడ్డి, కరీంనగర్, కాజీపేట జంక్షన్, ఖమ్మం, లింగపల్లి, మధిర, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మలక్‌పేట్, మల్కాజ్‌గిరి, మంచిర్యాల్, మేడ్చల్, మిర్యాలగూడ, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రామగుండం, సికింద్రాబాద్, షాద్‌నగర్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగుళాంబ, తాండూర్, ఉందానగర్, వికారాబాద్, వరంగల్, యాదాద్రి, యాకుత్‌పురా, జహీరాబాద్.

- మొదటి విడతలో ఆగస్టు 6న పనులు ప్రారంభం కానున్న 21 స్టేషన్లపై రూ.894 కోట్లు ఖర్చుచేయనున్నారు.

హైదరాబాద్ (నాంపల్లి) - రూ.309 కోట్లు	
నిజామాబాద్ - రూ.53.3 కోట్లు	
కామారెడ్డి - రూ.39.9 కోట్లు	
మహబూబ్‌నగర్ - రూ.39.9 కోట్లు	
మహబూబాబాద్ - రూ.39.7 కోట్లు	
మలక్‌పేట్ (హైదరాబాద్)- రూ.36.4 కోట్లు	
మల్కాజ్‌గిరి (మేడ్చల్) - రూ.27.6 కోట్లు	
ఉప్పుగూడ (హైదరాబాద్)- రూ.26.8 కోట్లు	
హఫీజ్ పేట (హైదరాబాద్) - రూ.26.6 కోట్లు	
హైటెక్ సిటీ (హైదరాబాద్) - రూ.26.6 కోట్లు	
కరీంనగర్ - రూ.26.6 కోట్లు	
రామగుండం (పెద్దపల్లి)- రూ.26.5 కోట్లు	
ఖమ్మం - రూ.25.4 కోట్లు	
మధిర (ఖమ్మం) - రూ.25.4 కోట్లు	
జనగాం - రూ.24.5 కోట్లు	
యాదాద్రి - రూ.24.5 కోట్లు (యాదాద్రి భువనగిరి)	
కాజీపేట జంక్షన్ - రూ.24.5 కోట్లు (హనుమకొండ)	
తాండూర్ (వికారాబాద్)- రూ.24.4 కోట్లు	
భద్రాచలం రోడ్ - రూ.24.4 కోట్లు (కొత్తగూడెం)	
జహీరాబాద్ (సంగారెడ్డి)- రూ.24.4 కోట్లు	
ఆదిలాబాద్ - రూ.17.8 కోట్లు	

బ్రో.. ఇది పెద్ద స్కామ్.. నిర్మాత ద్వారా పవన్‌కు బాబు ప్యాకేజీ

ఏపీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: తనను కించపరిచేలా బ్రో సినిమాలో ఓ పాత్ర పెట్టి పవన్ కల్యాణ్ శునకానందం పొందుతున్నారని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. బ్రో సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కలెక్షన్లు పెంచుకో వడం కోసమే తన పాత్రపై వివాదం సృష్టిస్తున్నా రని ఆరోపించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవా రం మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. బ్రో సినిమా నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌కు అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్నాయన్నారు. చంద్రబాబు ముఠా అమెరికాలో డబ్బులు వసూలు చేసి విశ్వప్రసాద్‌కి ఇస్తే.. ఆ మొత్తాన్ని పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ రూపంలో అందించారని తీవ్ర విమర్శలు చేశారు. దీనికి ఆధారాలు ఏమిటని ఒక విలేకరి ప్రశ్నించగా.. అంతర్జాతీయ నిఘా సంస్థకు చెందిన ప్రముఖుడొకరు తనకి విషయాన్ని చెప్పారని అంబటి వెల్లడించారు. తన రెమ్యూనరేషన్ కింద రూ.66 కోట్లు తీసుకున్నారా? లేక రూ.80 కోట్లు తీసుకున్నారా? ఈ మొత్తానికి ఆదాయపన్ను శాఖకు లెక్కలు చెప్పారా? అనేది పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్ కింద రోజుకు రూ.2 కోట్లు తీసుకున్నారని ఒకరు, 40 రోజులు కాల్షీట్లు ఇచ్చారని ఒకరు, 23 రోజులే ఇచ్చారని ఒకరు చెప్పారని గుర్తు చేశారు. 40 రోజులపాటు కాల్షీట్లు ఇచ్చి ఉంటే పవన్‌కు రూ.80 కోట్లు ముట్టినట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ బ్లాక్ మనీని వైట్‌గా చేసి పవన్‌కు ప్యాకేజీ రూపంలో ఇచ్చారని ఆరోపించారు. ఇది ఒక కుంభకోణమన్నారు.

జిల్లా వార్తలు

6న ఈఅండ్‌ఎం (ఏఈ) రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న 24 ఈఅండ్‌ఎం(ఏఈ) ఇంటర్నల్ పోస్టుల భర్తీకి ఈ నెల 6న రాతపరీక్ష నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ పరీక్ష జరగనుంది. యాజమాన్యం మార్చిలో నోటిఫికేషన్ ఇవ్వగా సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల నుంచి 600 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 549 మందికి హాల్‌టికెట్లు జారీ చేసి, పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ఎన్నడు?

సింగరేణిలో సుమారు 280 పోస్టుల (ఎక్స్‌టర్నల్) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని అధికారులు ఏడు నెలల కిందట వెల్లడించారు. అయినా ఇప్పటికీ నోటిఫికేషన్ రాలేదని నిరుద్యోగులు వాపోతున్నారు. 2017లో సుమారు 250 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాక మళ్లీ ఇప్పటివరకు ఇవ్వకపోవడం సరికాదని, ఇకనైనా యాజమాన్యం స్పందించాలని కోరుతున్నారు.

డ్రమ్ సీడర్ ద్వారా తగ్గనున్న ఖర్చు



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తల్లాడ: వరి సాగులో డ్రమ్ సీడర్ వినియోగం ద్వారా ఖర్చు తగ్గడమే కాక దిగుబడి పెరుగుతుందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జెస్సీ సునీత తెలిపారు. తల్లాడ మండలం కుర్నవల్లిలో మంగళవారం డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానం అవలంబిస్తే ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. అలాగే, పంట ముందే కోతకొచ్చి దిగుబడి పెరుగుతుందని చెప్పారు. తక్కువ కాల పరిమితి కలిగిన వరి రకాలను డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు అనూష, అఖిల, రేతిక, ప్రసన్న, మనీషా, రైతులు ఐలూరి వెంకటకోటి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ బృందం పర్యటన

చింతకాని: మండలంలోని పరిధిలోని నాగులవంచ గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ రాష్ట్ర పరిశీలకులు వెంకట్ మంగళవారం సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులే కాక పారిశుద్ధ్య, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్షాలతో బొగ్గు ఉత్పత్తిలో వెనుకంజ

- జూలైలో సింగరేణివ్యాప్తంగా 87 శాతం నమోదు
- 100 శాతం సాధించిన ఐదు ఏరియాలు



రుద్రంపూర్ ఆర్‌సీహెచ్‌పీ ద్వారా రవాణా చేస్తున్న బొగ్గు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రవ్యాప్తంగా జూలై మాసంలో కురిసిన వర్షాలు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపైప్రభావం చూపాయి. సంస్థ వ్యాప్తంగా లక్ష్యంలో 13 శాతం మేర ఉత్పత్తికి కోత పడింది. జూలైలో సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల్లోని 18 ఓపెన్‌కాస్ట్ గనులు, 24 భూగర్భ గనుల్లో కలిపి 47.92 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 41.53 లక్షల టన్నుల (87 శాతం) ఉత్పత్తి నమోదైంది. ఓసీల్లో 41.36 లక్షల టన్నుల లక్ష్యానికి 37.53 లక్షల టన్నులు (91 శాతం), భూగర్భ గనుల్లో 6,56,928 టన్నులకు గాను 4,00,718 టన్నుల (61 శాతం) ఉత్పత్తి జరిగిందని అధికారులు వెల్లడించారు.

ఐదు ఏరియాల్లో ఓకే..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు సంబంధించి జూలైలో ఐదు ఏరియాలు వంద శాతం ఉత్పత్తి సాధించాయి. మణుగురు ఏరియా 7,76,500 టన్నులకు గాను 10,46,500 టన్నుల (124 శాతం) ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత కొత్తగూడెం ఏరియాలో 9,77,760 టన్నులకు 10,39,673 టన్నులు (106 శాతం), ఆర్జీ–3 ఏరియాలో 3,55,200 టన్నులకు గాను 3,71,909 టన్నులు (105 శాతం), బెల్లంపల్లి ఏరియాలో 1,92,000 టన్నులకు 1,95,184 టన్నులు (102 శాతం), ఇల్లెందు ఏరియాలో 2,04,808 టన్నులకు 2,06,750 టన్నుల (101 శాతం) ఉత్పత్తి నమోదైంది. మిగతా ఏరియాల్లో ఆర్జీ–1లో 83 శాతం, మందమర్రిలో 76 శాతం, శ్రీరాంపూర్ ఏరియాలో 72 శాతం, ఆర్జీ–2 ఏరియాలో 56 శాతం, భూపాలపల్లి ఏరియాలో 45 శాతం, ఆండ్రియాల ప్రాజెక్టులో 28 శాతం ఉత్పత్తి మాత్రమే నమోదైందని అధికారులు నివేదికలో పొందుపర్చారు.

21.25 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా

సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నాలుగు నెలల్లో 21.25 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయటమే కాకుండా, ఆ మొత్తం బొగ్గును రవాణా చేయటం విశేషం. గతేడాది ఇదే నాలుగు నెలల్లో 20.05 మిలియన్ టన్నులు మాత్రమే రవాణా చేయగా, ఈసారి జూలైలో వర్షాలు కురిసినా అంతకు మించి రవాణా చేయగలిగారు.

ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

జూలైలో కేవలం ఐదు ఏరియాల్లో మాత్రమే వంద శాతం ఉత్పత్తి నమోదైంది. ఇక నుంచైనా లక్ష్య సాధనపై అధికారులు దృష్టి సారించాలి. వర్షాలు లేని రోజు అధికంగా ఉత్పత్తి చేసి, నిల్వ చేస్తూ వర్షం వచ్చిన రోజు రవాణా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సంస్థ నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటాం.
–ఎస్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)

ఇజ్రాయిల్‌లో పంటల అధ్యయనానికి ఎంపిక

ఖమ్మంవ్యవసాయం: ఇజ్రాయిల్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలపై అధ్యయనానికి ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం దక్కింది. ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు ఇజ్రాయిల్ దేశంలో పంటల సాగు పద్ధతులు, యంత్రాల వినియోగం, సాంకేతకతపై అధ్యయనం చేసేందుకు రాష్ట్రం నుంచి 30 మందిని ఎంపిక చేశారు. ఇందులో జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల, రైతుబంధు సమితి కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావుకు స్థానం దక్కింది. రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ ఎం.హన్మంతరావు ఆధ్వర్యాన ఈ స్టడీ టూర్ సాగనుండగా, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు డాక్టర్ ఈ.శ్రీనివాసరావు కూడా పాల్గొంటారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీపై నమ్మకంతో వచ్చే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆకట్టుకోవాలని ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న సూచించారు. ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం రీజియన్‌లోని డిపో మేనేజర్లు, సీఐలతో ఆయన సమావేశమయ్యారు. డిపోల్లో ప్రస్తుత స్థితిగతులు, కావాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకొచ్చేలా ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని తెలిపారు. సదుపాయాల కల్పనలో అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీటీఎం బి.ప్రసాద్, డిపో మేనేజర్లు శ్రీనివాస్, దేవదానం రాజ్యలక్ష్మి, రామారావు, స్వామి, వెంకటేశ్వర్లు, అధికారులు రామ్మోహన్, బాలస్వామి, శ్రీనివాస్, రామయ్య పాల్గొన్నారు.

మూడో సారి కూడా కూలింది!



ట్రాక్‌పై శిథిలాలను తీయిస్తున్న అధికారులు

కారేపల్లి: నాణ్యతాలోపం, అధికారుల పర్యవేక్షణలేమితో కారేపల్లి మండలంలోని గాంధీపురం రైల్వేస్టేషన్ పనుల్లో అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. గాంధీపురంలో నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ ప్రహరీ గతంలో రెండుసార్లు కూలి ఫ్లాట్‌ఫాం బీటలు బారింది. తిరిగి మళ్లీ నిర్మాణం చేపట్టగా మంగళవారం సాయంత్రం కూడా బీటలు బారిన ఫ్లాట్‌ఫాం కూలి ట్రాక్‌పై శిథిలాలు పడ్డాయి. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా చీకట్లోనే జేసీబీతో శిథిలాల తొలగింపు పనులు చేపట్టారు

ఎఫ్ఆర్ఓ చలమల కుటుంబానికి 500 గజాల స్థలం



ఎఫ్ఆర్ఓ భార్య సమక్షాన స్థలం హద్దులు నిర్ధారిస్తున్న ఉద్యోగులు

రఘునాథపాలెం: గొత్తికోయల చేతిలో హత్యకు గురైన ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా 500 గజాల ఇంటి స్థలాన్ని రఘునాథపాలెంలోని జింకలతండా రోడ్డులో కేటాయించారు. రఘునాథపాలెం మండలం ఈర్లపుడికి చెందిన శ్రీనివాసరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ అధికారిగా విధులు నిర్వర్తించగా, గత ఏడాది నవంబర్ 22న అటవీ భూమిని రక్షించే క్రమాన గొత్తికోయల దాడిలో హత్యకు గురయ్యారు. దీంతో ప్రభుత్వం ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మికి తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరిత దినోత్సవం సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. ప్రస్తుతం కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ శ్రీనివాస్ రఘునాథపాలెంలోని సర్వే నంబర్ 30లో 500 గజాల ఇంటి స్థలాన్ని భాగ్యలక్ష్మి సమక్షాన హద్దులు నిర్ధారించి అప్పగించారు. కాగా, తొలుత ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లో స్థలం కేటాయించగా పనులు చేపట్టే క్రమంలో ఎన్నెస్పీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత నగర శివారు ధంసలాపురంలో స్థలం కేటాయించినా శ్రీనివాసరావు కుటుంబీకులు తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. చివరకు రఘునాథపాలెంలో కేటాయింగా ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చినట్లయింది.

ప్రభుత్వంలోకి ఆర్టీసీ ఉద్యోగులు !

- ఖమ్మం రీజియన్‌లో 2,109 మందికి లబ్ధి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల సంబరాలు



ఖమ్మం బస్టాండ్‌లో కేక్ కట్ చేస్తున్న డీఎం శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టనున్నారు. ఈ నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ద్వారా ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోలకు చెందిన 2,109 మంది ఉద్యోగులకు లబ్ధి జరగనుందని చెబుతున్నారు.

కొత్త బస్టాండ్‌లో సంబరాలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయగా, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని చెప్పారు. ఈకార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పాల్వంచ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఎం.డీ.వై.పాషాతో పాటు ఉమామహేశ్వరావు, సెల్వరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రీజియన్‌లో ఉద్యోగుల వివరాలు

డిపో	కండక్టర్లు	డ్రైవర్లు	గ్యారేజ్ మెకానిక్‌లు	ఇతర సిబ్బంది	మొత్తం
ఖమ్మం	274	172	61	47	554
కొత్తగూడెం	127	86	41	27	281
సత్తుపల్లి	166	112	36	31	345
మధిర	105	78	27	23	233
మణుగూరు	108	102	27	24	261
భద్రాచలం	176	147	37	30	390
ఆర్ఎం కార్యాలయం	45				

